రోడ్లు ఇలా.. ప్రయాణం సాగేదెలా ?

- జంగారెడ్డిగూడెంలోని ప్రధాన రోడ్ల దుస్థితి అధ్వానం
- బెంబేలెత్తిపోతున్న వాహనదారులు


యాక్సిస్ బ్యాంకు సమీపంలో ధ్వంసమైన రహదారి


కొత్త బస్టాండ్ సమీపంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

జంగారెడ్డిగూడెం: పట్టణం నిత్యం రద్దీగా ఉంటుంది. ఏజెన్సీ ప్రాంతానికి అనుకొని ప్రధాన పట్టణం కావడంతో ఎక్కువగా గిరిజనులు వివిధ అవసరాల నిమిత్తం జంగారెడ్డిగూడెం పట్టణానికి వస్తుంటారు. పట్టణంలోని ప్రధాన రహదారులు అశ్వారావుపేట రోడ్డు, ఏలూరు రోడ్డు ఎప్పుడూ పట్టణానికి వచ్చి పోయే వారితో రద్దీగా ఉంటాయి. ఇటువంటి ప్రధాన రహదారులు అధ్వానంగా ఉండటంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వర్షం కురిస్తే చాలు రోడ్డు కాలువలా మారిపోయి, కొన్ని చోట్ల చెరువులను తలపిస్తున్నాయి. జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీగా రూపాంతరం చెందిన తరువాత ఎన్నో వాణిజ్య, వ్యాపార సంస్థలు తమ కార్యకలాపాలను జంగారెడ్డిగూడెం పట్టణంలో కొనసాగిస్తున్నాయి. మాల్స్, పెద్ద పెద్ద షాపులతో పాటు చిరు వ్యాపారులతో పట్టణం సందడిగా ఉంటుంది. అయితే పట్టణంలోని అశ్వారావుపేట రోడ్డు, ఏలూరు రోడ్డు అధ్వానంగా ఉండటంతో వాహనాలపై వచ్చేవారి ఇబ్బందులు వర్ణణాతీతం. ముఖ్యంగా ద్విచక్ర, వాహనదారులు, ఆటోల వారి ఇబ్బందులు వర్ణనాతీతం. రోడ్డుపై దుమ్ము ధూళి ఎగసి పడటంతో రోడ్డు పక్కనే వ్యాపార సముదాయాల వారు ఇబ్బందులు పడుతున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో ప్రధాన రహదారులను మరమ్మతులు చేయడానికి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. స్థానిక బోసుబొమ్మ సెంటర్ నుంచి నిర్మల ఆసుపత్రి వరకు, ఎంపీడీవో కార్యాలయం నుంచి కాకర్ల జంక్షన్ వరకు ఉన్న అశ్వారావుపేట రోడ్డుకు మరమ్మతులు చేసేందుకు రూ.21.30 లక్షలు మంజూరు కాగా, వాటితో ఎన్నికల ముందు ప్యాచ్‌వర్కులు చేశారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు రోడ్లు మరోసారి ఛిద్రమయ్యాయి. ప్యాచ్‌వర్కులు పూర్తిగా పాడై పెద్దపెద్ద గోతులు పడి నీరు నిలిచిపోతుంది. ఆదమరిస్తే వాహనదారులు ప్రమాదాలకు గురి కావాల్సిందే. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి జంగారెడ్డిగూడెం పట్టణంలోని ప్రధాన రోడ్ల నిర్మాణం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం



జంగారెడ్డిగూడెం పట్టణంలో రోడ్ల మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపాం. ఎన్నికల ముందు ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులతో పట్టణంలోని ప్రధాన రహదారులకు ప్యాచ్ వర్కులు చేశాం. ఇటీవల కురిసన వర్షాలకు రోడ్లు మరోసారి ఛిద్రమయ్యాయి. ప్రస్తుతం శాశ్వత ప్రాతిపదికన రోడ్లు నిర్మాణం చేసే దిశగా ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందించారు. రోడ్డుకు మరమ్మతులతో పాటు ఒక లేయర్ రోడ్డు నిర్మించేందుకుగాను స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి బైపాస్ రోడ్డు వరకు రూ.35లక్షల, బోసుబొమ్మ సెంటర్ నుంచి నిర్మల ఆసుపత్రి వరకు రూ.30 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపసాదనలు పంపాం. అనుమతులు రాగానే పనులు చేపడతాం. – సీహెచ్ హరికృష్ణ, డీఈ, ఆర్అండ్‌బీ, జంగారెడ్డిగూడెం

మాజీ ఎమ్మెల్యే బాలరాజు పరామర్శ


భాగ్యం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న బాలరాజు, తదితరులు

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం రాచన్నగూడేనికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సింగలదేవి సత్యనారాయణ ఇటీవల రోడ్డు యాక్సిడెంట్‌లో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను గురువారం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పరామర్శించారు. సత్యనారాయణ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. జీలుగుమిల్లికి చెందిన మరో సీనియర్ వైఎస్సార్‌సీపీ కార్యకర్త గుడెల్లి భాగ్యం కుటుంబాన్ని కూడా బాలరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చందా ప్రసాద్, నాయకులు బోదా శ్రీనివాసరెడ్డి, బూరుగు ప్రేమ్‌కుమార్, వనమా రామకృష్ణ, వీరంకి వెంకటేశ్వరరావు, చిట్టిబొమ్మ శ్రీనివాస్, కొప్పుల సత్యనారాయణ, ఉప్పల రాంపండు, తగరం రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాల సందర్శన


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీ

బుట్టాయగూడెం: మండలంలోని ఇప్పలపాడు సమీపంలోని ఏకలవ్య మోడల్ పాఠశాలను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యాబోధన, వసతిగృహంలోని సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ మహేష్ కుమార్ యాదవ్ విలేకర్లతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో మరొక ఏకలవ్య మోడల్ పాఠశాలను ఏర్పాటు చెయ్యనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మీడియా ప్రతినిధులపై ఎంపీ అనుచరుడి దౌర్జన్యం

ఏలూరు ఎంపీ మహేష్ కుమార్ యాదవ్ పర్యటనను కవర్ చెయ్యడానికి వెళ్లిన మీడియా ప్రతినిధులపై ఎంపీ అనుచరులలో ఒక వ్యక్తి దౌర్జన్యానికి పాల్పడ్డాడు. న్యూస్ కవర్ చేసే విషయంలో నువ్వు ఏ పేపర్, ఏ ఛానల్ అంటూ ఆ వ్యక్తి విలేకరిని ప్రశ్నించడంతోపాటు బయటకు వస్తే తేల్చుకుందాం అంటూ హెచ్చరించాడు. దీంతో అక్కడే ఉన్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు న్యూస్ కవరేజ్‌ను నిలిపి వేసి నిరసనకు దిగారు. దీంతో ఆ వ్యక్తి క్షమాపణ చెప్పాడు. అయితే అక్కడ మీడియా ప్రతినిధులపై అంత దౌర్జన్యం జరిగినా ఎంపీ, ఎమ్మెల్యే, ట్రైకార్ చైర్మన్లు కనీసం నోరు మెదపకపోవడం పట్ల మీడియా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


కొయ్యలగూడెం: పోటీలకు ఎంపికైన విద్యార్థులు



కామవరపుకోట: విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొయ్యలగూడెం: రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు కొయ్యలగూడెం మండలం నుంచి పలువురు విద్యార్థులు ఎంపికైనట్లు గురువారం ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గురువారం పేర్కొన్నారు. ఏలూరు ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన త్రోబాల్ సెలక్షన్స్ పోటీల్లో తమ హైస్కూల్ నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని రాజవరం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం రామారావు తెలిపారు.

కె.కోట విద్యార్థుల ఎంపిక

కామవరపుకోట: రాష్ట్ర స్థాయి త్రోబాల్, కబడ్డీ పోటీలకు కామవరపుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గసబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు తూంపాటి బాబురావును, గుడిదల శ్యామలాదేవిని గ్రామస్తులు అభినందించారు.

జాయింట్ కలెక్టర్ విస్తృత పర్యటన


విద్యార్థులను పాఠ్యాంశాలను అడిగి తెలుసుకుంటున్న జేసీ ధాత్రిరెడ్డి

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలంలో గురువారం జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ రహదారి 365 బీబీ పనులు చేపట్టేందుకు భూసేకరణ రికార్డులను పరిశీలించారు. అనంతరం కామయ్యపాలెంలో ఏర్పాటు చేసిన వన్‌దన్ కేంద్రాన్ని పరిశీలించారు. జీలుగుమిల్లి గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బోధిస్తున్న పాఠ్యాంశాల గురించి ఆరా తీశారు. అలాగే వసతి గృహంలో సౌకర్యాలను పరిశీలించడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యం పట్ల తీసుకుంటున్న శ్రద్ధపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

31న ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

వేలేరుపాడు: ఈ నెల 31న నిర్వహించే ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని, మండల కార్యదర్శి కారం దారయ్య పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ 105వ ఆవిర్భవ దినోత్సవాన్ని వాడవాడలా ఘనంగా నిర్వహించాలని, పతాకవిష్కరణ సభలు సమావేశాలు నిర్వహించాలన్నారు. గురువారం ఇక్కడి సీపీఐ కార్యాలయ ఆవరణలో జరిగిన సమావేశంలో దారయ్య ప్రసంగించారు. కార్యక్రమంలో ఏఐటియుసి అంగన్వాడీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొలూరి సైదా మండల కార్యదర్శి చందా రమాదేవి కుంజా వెంకటలక్ష్మి పిట్టా రమ, మడకం సరోజిని, లీలావతి, జి వెంకటేశ్వరి, నాగమణి, మహాలక్ష్మి వీరభద్రమ్మ శ్రీకాంత,తదితరులు పాల్గొన్నారు.

చర్చలు సఫలం, నిరసనలు విరమణ


కాంట్రాక్ట్ ప్రతినిధులతో చర్చలు జరుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు

జంగారెడ్డిగూడెం: ఏపీ మెడికల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఐదు రోజులుగా చేస్తున్న నిరసన కార్యక్రమాలను గురువారం విరమించారు. హాస్పిటల్ పారిశుద్ధ్య కార్మిక సంఘం ఏఐటీయూసీ నాయకులకు ఫస్ట్ ఆబ్జెక్ట్ ఏజెన్సీ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన కాంట్రాక్టర్ మధ్య జరిగిన చర్చలు సఫలం కావడంతో కార్మికులు నిరసన విరమించారు. ఈ నెల 30వ తేదీ లోపు రెండు నెలల పెండింగ్ వేతనాలు కార్మికులకు చెల్లిస్తామని, మిగతా పెండింగ్ వేతనాలు నవంబర్ 18వ తేదీ లోపు పూర్తి స్థాయిలో చెల్లిస్తామని లిఖిత పూర్వక హామీ ఇవ్వడంతో నిరసన కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా వేసినట్లు కార్మిక సంఘ నాయకులు జంపన వెంకటరమణ రాజు, కుంచే వసంతరావు తెలిపారు. కార్యక్రమంలో ద్వారకాతిరుమల మండల సీపీఐ కార్యదర్శి గొలిమే బాలఏసు, హాస్పిటల్ పారిశుద్ధ్య కార్మికుల సూపర్‌వైజర్లు వేముల రాజు, బూరుగు సంజీవ్, ఏరియా హాస్పిటల్ పారిశుద్ధ్య కార్మికుల సంఘం నాయకులు తోట దయామని, అల్లాది జ్యోష్న, గంగుల మేరీ, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

జంగారెడ్డిగూడెం రూరల్: ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన మండలంలోని నిమ్మలగూడేనికి చెందిన కంకిపాటి నాగరాజు కుటుంబాన్ని గురువారం మానవత సేవా సంస్థ సభ్యులు పరామర్శించారు. ఈ సందర్భంగా మానవత సంస్థ తరపున రూ.4,000, దాతలు రూ.11500, 175 కేజీల బియ్యాన్ని నాగరాజు కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మానవతా సంస్థ ఉపాధ్యక్షుడు అల్లూరి రామకృష్ణ, మండల కార్యదర్శి గద్దే సత్యనారాయణ, ట్రెజరర్ మాధవరావు, జిల్లాకన్వీనర్ త్రిపుర సుందరిలు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు

జంగారెడ్డిగూడెం: కార్తీక మాసం సందర్భంగా జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో పంచారామ క్షేత్రదర్శిని పేరుతో బస్సు సర్వీసు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ గంగాధర్ తెలిపారు. ప్రతీ ఆదివారం రాత్రి జంగారెడ్డిగూడెం బస్టాండ్ నుంచి అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట (పంచారామాలు) పుణ్యక్షేత్రాల దర్శన నిమిత్తం ప్రత్యేక బస్సు బయలుదేరుతుందన్నారు. నవంబర్ 3, 10, 17, 24 తేదీలలో రాత్రి 8.45 గంటలకు బయలుదేరుతాయని, అల్ట్రా డీలక్స్ టికెట్ ధర పెద్దలకు రూ.1100 నిర్ణయించామన్నారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని తెలిపారు. అలాగే కార్తీకమాసంలో ప్రతీ శుక్రవారం, ఆదివారాలలో రాత్రి 9.00 గంటలకు అన్నవరం వెళ్లు భక్తులకు ప్రత్యేక బస్సులు నడపబడును. ప్రతీ పౌర్ణమికి అరుణాచల గిరి ప్రదక్షిణ నిమిత్తం ప్రతీ నెల పౌర్ణమికి రెండు రోజుల ముందుగా జంగారెడ్డిగూడెం డిపో నుంచి రాత్రి 7.00 గంటలకు ప్రత్యేక బస్సు బయలు దేరుతుందన్నారు. ఈ బస్సు శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం క్షేత్రాల దర్శన అనంతరం అరుణాచలం చేరుతుందన్నారు. పౌర్ణమి రోజున అరుణాచలంలో గిరి ప్రదక్షిణ, దర్శన అనంతరం తిరిగి జంగారెడ్డిగూడెం బయలుదేరుతుందన్నారు. టికెట్ ధర రూ.2800, ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని తెలిపారు. శబరిమల వెళ్లు అయ్యప్ప భక్తులకు వారు కోరిన రూట్ నందు వారు కోరిన తేదీల్లో సూపర్ లగ్జరీ బస్సులు ప్యాకేజీ టూర్‌గా ఇవ్వబడుతుందన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసినదిగా ఆయన కోరారు. ఇతర వివరాలకు డిపో మేనేజర్: 9959225489, అసిస్టెంట్ మేనేజర్ 9491019105, బస్టాండ్ ఎంక్వైరీ 08821 223228, రిజర్వేషన్ కౌంటర్ 8341134111 నెంబర్లను సంప్రదించాలన్నారు.

క్రైమ్ కార్నర్

చెల్లెలి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు

జంగారెడ్డిగూడెం : చెల్లెలి అదృశ్యంపై ఆమె అన్నయ్య చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ జె.భీమశేఖర్ తెలిపారు. కేతవరం గ్రామానికి చెందిన ఆడమిల్లి రాజు, శైలజలకు వివాహం అయ్యి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య,భర్తలు తరచూ గొడవలు పడుతుండడంతో శైలజ కుటుంబ సభ్యులు పెద్దల్లో పెట్టారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. ఈ క్రమంలో ఈ నెల 21వ తేదీ నుంచి శైలజ కనిపించడం లేదు. దీంతో తన చెల్లెలు అదృశ్యం వెనుక ఆమె భర్తపై రాజుపై అనుమానం ఉన్నట్లు శైలజ సోదరుడు ఇసనంపల్లి రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చీటింగ్ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: కనకదుర్గ ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థను మోసం చేసిన నేరంపై నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. ఏలూరుకు చెందిన కనకదుర్గ ఫైనాన్స్ లిమిటెడ్ ఏరియా మేనేజర్ అయిన వి.హేమంత్‌కుమార్ వార్షిక ఆడిట్‌లో భాగంగా జంగారెడ్డిగూడెంలోని బ్రాంచ్ నందు ఆడిట్ సిబ్బంది ఆడిట్ నిర్వహించారు. ఈ ఆడిట్‌లో నకిలీ బంగారు వస్తువులు ఉన్నట్లు గుర్తించారు. ఇలా నకిలీ బంగారం ద్వారా రూ.23 లక్షల వరకు మోసం జరిగినట్లు గుర్తించి, దీనికి కారణమైన బ్రాంచ్ మేనేజర్ ఎస్.దుర్గాప్రసాద్, అతని అన్న ఎస్.శ్రీనివాస్, స్నేహితుడు మురళితో పాటు బ్రాంచ్ క్యాషియర్ కమ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ టి.నాగబాబులపై హేమంత్‌కుమార్ ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం అక్రమంగా తరలిస్తుండగా..

జంగారెడ్డిగూడెం: మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు పేరంపేట రోడ్డులోని పాత జీడిగింజల ఫ్యాక్టరీ సమీపంలో గురువారం తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ తనిఖీలో పైడిపాక ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన ఆండ్ర పెద్దరాజు మోటార్‌సైకిల్‌పై రూ.3 వేలు విలువ చేసే 20 మద్యం సీసాలను తరలిస్తూ పట్టుబడ్డాడన్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

కిళ్లీ షాపునకు నిప్పంటించిన వ్యక్తి అరెస్ట్

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని లక్కవరంలో కిళ్లీ షాపునకు నిప్పంటించిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు స్టేషన్ రైటర్ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం లక్కవరానికి చెందిన చిట్టిబొమ్మ నాగేశ్వరమ్మ గ్రామంలో కిళ్లీ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తుంది. గత అర్ధరాత్రి 3 గంటల సమయంలో అదే గ్రామానికి దల్లి సాయి అనే వ్యక్తి మద్యం మత్తులో కిళ్లీ షాపుకు నిప్పటించాడు. ఈ ప్రమాదంలో రూ.75 వేల నష్టం సంభవించినట్లు నాగేశ్వరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పేకాట శిబిరంపై దాడి

టి.నరసాపురం: పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్సై ఎం.జయబాబు మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు మండలంలోని అప్పలరాజుగూడెం శివారులో పేకాట శిబిరంపై దాడి చేశామన్నారు. ఈ దాడిలో 14 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1,79,500 నగదు, 4 ద్విచక్ర వాహనాలు, 2 కార్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జంగారెడ్డిగూడెం: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో న్యూ ఫీడర్ పనుల నిమిత్తం ఈ నెల 25న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పీఆర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. పట్టణంలోని కాలేజ్ రోడ్డు, సాలిపేట, శ్రీనివాసపురం ఏరియా, రాజులకాలనీ, సుబ్బారెడ్డి కాలనీ, అశ్వారావుపేట రోడ్డు, ఉప్పలమెట్ట, అన్ని అగ్రికల్చర్ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగుతుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బుట్టాయగూడెం: 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ నిలిపివేస్తామన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి


ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై కుటుంబరావు

చింతలపూడి: ద్విచక్ర వాహనదారులు నిబంధనలు పాటించాలని ఎస్సై కుటుంబరావు హెచ్చరించారు. చింతలపూడిలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి జరిమానాలు విధించారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ప్రాముఖ్యతపై అవగాహన కలిగించారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. తనిఖీల్లో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ

చింతలపూడి: చింతలపూడి బోసుబొమ్మ సెంటర్‌లో గురువారం ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ హెల్మెట్ వినియోగంపై నిర్వహించిన అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాల్సిందేనని లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోయినా, సీట్ బెల్ట్ ధరించకపోయినా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. అనంతరం హెల్మెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐ రవీంద్ర నాయక్, ఎస్ఐ కుటుంబరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


పైపుల నిర్మాణ భూమి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: జల్ జీవన్ మిషన్ అభివృద్ధి నిధులతో పాత పరింపూడి గ్రామంలో చేపట్టిన పైపులైన్ నిర్మాణ భూమి పూజ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచ్ ముప్పిడి విజయకుమారి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేయబడిన జలజీవన్ మిషన్ నిధుల ద్వారా కొత్త పరింపూడి ఎస్టీ ఏరియాలో 1.20 లక్షల లీటర్ల సామర్ధ్యంతో కూడిన వాటర్ ట్యాంక్ నిర్మిస్తామన్నారు. ఉప సర్పంచ్ సంకుకొండ, ఈవో కంపా సురేష్, జేష్ఠ రామకృష్ణ, తవ్వా గోపాల్, వూసల రాజేష్, మాదేపల్లి శ్రీను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

జంగారెడ్డిగూడెం: ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఫెన్సింగ్ పోటీలకు స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎం.కీర్తి, ఎం.నాగతులసి, ఎస్.కార్తీక్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.ప్రసాద్ బాబు, అధ్యాపకులు అభినందించారు. విద్యార్థులను అనేక క్రీడా రంగాల్లో పాల్గొనే విధంగా సహకరిస్తున్న కళాశాల ఫిజికల్ డైరెక్టర్ నిట్టా వినయ్‌కు అభినందనలు తెలిపారు.

రెండు తలల పాము ప్రత్యక్షం



ద్వారకాతిరుమల: స్థానిక వసంత్‌నగర్ కాలనీ సమీపంలోని ఒక పొలంలో గురువారం రాత్రి రెండు తలల పాము ప్రత్యక్షమైంది. దీన్ని చూసిన రైతు ముందు భయాందోళనకు గురయ్యాడు. అయితే రెండు తలల పాము వలన ఏవిధమైన హానీ ఉండదని తెలిసి, దాన్ని చంపకుండా విడిచి పెట్టాడు. దీంతో ఆ పాము పంట బోదెలోకి వెళ్లిపోయింది. ఈ పాము చాలా పొడవుగా, లావుగా ఉండటంతో రైతు తన సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడు. దాన్ని పలువురు ఆసక్తిగా తిలకించారు.

సూపర్ సిక్స్ అమలు చేయాలి

జంగారెడ్డిగూడెం: సూపర్‌సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఆర్ ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెం బస్టాండ్ వద్ద గురువారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన నిరసన, ధర్నా కార్యక్రమం నిర్వహించారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వలన మొదటి విడత ఖాళీ చేసిన నిర్వాసిత గ్రామాల్లోని నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని విభజన హామీల హక్కుల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ అన్నారు. పోలవరం మండలం పైడిపాక గ్రామంలో ఆయన నిర్వాసితుల సమస్యలను గురువారం అడిగి తెలుసుకున్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తురాలు గురువారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన కంచర్ల జానకి ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమ చేశారు. దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించి, అభినందించారు.

నేడు జాబ్ మేళా

జంగారెడ్డిగూడెం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెంలోని శ్రీ రామచంద్ర డిగ్రీ కళాశాలలో ఈ నెల 25వ తేదీ శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏలూరు జిల్లా ఇన్‌చార్జి వాడపల్లి కిషోర్ తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ముత్తూట్ ఫైనాన్స్, హెటిరో ల్యాబ్స్, డేటా బ్లూమ్, జంగారెడ్డిగూడెం శ్రీ రామచంద్ర గ్రూప్స్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్, లగ్జరీ ల్యాండ్ లార్డ్ యూనివర్సల్ ప్రాజెక్ట్, పొట్లం యాప్, ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, సుమారు 260 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తారని తెలిపారు. ఈ జాబ్‌మేళాకు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు ఉండి 18–30 సంవత్సరాల మధ్య వయస్సు గల వారు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 9182342688, 9652503799 నెంబర్లకు ఫోన్ చేయాలని, జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయోడేటా సర్టిఫికెట్స్ నకళ్లతో హాజరు కావాలని కోరారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

బుట్టాయగూడెం: దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో జె.సురేష్ తెలిపారు. మండలంలోని ఎన్ఆర్ పాలెం సమీపంలోని చెరువులో దోమల నివారణకు గంబూషియా చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల అధిక వర్షాల కారణంగా మురికిగుంటలు ఎక్కువగా ఏర్పడ్డాయన్నారు. వాటిలో దోమల లార్వా వృద్ధి చెందకుండా గంబూషియా చేపపిల్లలను విడిచి పెడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో కేఆర్‌పురం డాక్టర్ చందన మాథుర్, సబ్‌యూనిట్ ఆఫీసర్ శ్రీరామరాజు, ఏఎంఓ పందిరి శ్రీను, కేఆర్‌పురం సూపర్వైజర్ దేవరాజు, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి దేవస్థానంలో వచ్చే నెల 2 నుంచి ప్రారంభమయ్యే కార్తీక మాస మహోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ చేతుల మీదుగా కరపత్రాలను ఆవిష్కరించినట్లు మద్ది దేవస్థానం సహాయ కమిషనర్ ఆర్వీ చందన తెలిపారు.